



అక్రమ మద్యం, డబ్బు, గంజాయి జిల్లా లోనికి ప్రవేశించకుండా ముమ్మర తనిఖీలు

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 29 మార్చి, 2024 | పేజీలు : 05

# అంగరంగ వైభవంగా శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామివారల దివ్య కల్యాణం



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణం అంగరంగా వైభవంగా కన్నుల పండువగా జరిగింది. వరుడు శ్రీ రాజరాజేశ్వర స్వామి, వధువు పార్వతి దేవి అమ్మవారిని మేళతాళలలో చైర్మన్ చాంబర్ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కళ్యాణ వేదిక వద్ద వరకు ఎదుర్కొన్నారు. వరుడు తరుపున ఆలయ ఈఓ వధువు తరుపున అర్చకులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా, వరకట్నంగా 551 కోట్లు చెల్లిస్తామన్నారు. కన్యదాతలుగా అప్పల బీమా శంకర్ శర్మ ఇందిరలు వ్యవహరించారు. అంతకు ముందు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ స్థాన చార్యులు అప్పాల భీమా శంకర్ శర్మ అధ్వర్యంలో అభిజిత్ లగ్న మూహూర్తమున ఉదయం 10:55 నిమిషాల నుండి 12:05 నిమిషాల వరకు వేద మంత్రోచ్చారల తో శ్రీ స్వామి వారి కళ్యాణం ఘనంగా జరిపించారు. మరో వైపు శ్రీ స్వామి వారి కళ్యాణం జరుగుతుండగా శివ పార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకోని శివుడిని పెళ్లాడినట్లు స్మరించుకున్నారు. శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణ మహోత్సవం కు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తరుపున ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, అధికారులు మున్సిపల్ ఆఫీస్ నుండి మేళా తాళల మధ్య ఆలయంకు చేరుకుని స్వామి వారల కళ్యాణంకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణం తిలకించడానికి ర్టాషం నలుమూలల నుండి వేలాది గా భక్తులు శివ పార్వతులు తరలివచ్చారు. దీంతో రాజన్న ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయింది. దాదాపు 2 గంటల పాటు జరిగిన కళ్యాణాన్ని భక్తులు అసక్తిగా తిలకించారు. ప్రధానంగా కళ్యాణం జరిగేటప్పుడు శివ పార్వతులు చేతి లో త్రిశూలను కదలిస్తూ, ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకుని తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు.





## భక్తులకు అన్నదానం

శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల కల్యాణానికి వచ్చిన భక్తులందరికీ దేవాలయం తరఫున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుండి శివ కళ్యాణం మహోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు కళ్యాణ అనంతరం స్వామి వారి ప్రసాదంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, భక్తులు భోజనాలను చేసి వెళ్లాల్సిందిగా ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ వేదిక నుండి భక్తులకు తెలియజేశారు. గత సంవత్సరాల కన్నా భిన్నంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ఈవో కార్యాలయం ముందు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యంగా ఉండే విధంగా వేదికను ఏర్పాటు చేయడం వల్ల పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం కూడా ఆనందంగా ఉందని భక్తులు అన్నారు.

## మడేలేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ రూరల్ మండలం నమలిగుండు పల్లి గ్రామంలో మడేలేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సందర్భంగా ప్రభుత్వ విప్ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లంపల్లి నీరు నమిలి గుండుపల్లి చేరిన సందర్భంగా ప్రభుత్వ విప్ గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మడేలేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఎల్లంపల్లి నీరు నమలిగుండు పల్లి నీరు విడుదల సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు మారోజు రవి,మారోజు తిరుపతి,శంకరయ్య,అజయ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులుపాల్గొన్నారు.



## ఏప్రిల్ 6 వరకు బేటీ బచావో బేటీ పడావో ఐఈసి మెటీరియల్ కొసం టెండర్ సమర్పణ గడువు

### అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఏప్రిల్ 6 వరకు బేటి బచావో బేటి పడావో ఐఈసి మెటీరియల్ కొరకు టెండర్ సమర్పణ గడువు ఉందని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా సంక్షేమ అధికారి మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పెద్దపల్లి జిల్లా పరిధిలోని మహిళా సాధికారత కేంద్రంలో ఐఈసి మెటీరియల్ సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తిగల టెండర్ దారులు టెండర్‌లో పాల్గొనుటకు టెండర్ షెడ్యూల్ ను ఖరీదు వెయ్యి రూపాయలను District Welfare Officer, WCD & Sc, Peddapalli పేరు మీద డిడి/బ్యాంకు చెక్కు ద్వారా చెల్లించి ఏప్రిల్ 6 వరకు సాయంత్రం 3 గంటల్లోగా పొందాలని తెలిపారు. ఏప్రిల్ 6 సాయంత్రం 5 గంటల్లోపు సీల్డ్ టెండర్ సమర్పించడానికి గడువు ఉందని, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సీల్డ్ టెండర్లు సమర్పించాలని మిగిలిన వివరాలకు కార్యాలయపు పనివేళల్లో 7382452944 ఫోన్ నెంబర్ నందు సమర్పించాలని, ఇట్టి టెండర్ రద్దు మార్పులు చేయి పూర్తి అధికారం కమిటీ చైర్మన్ కు ఉంటుందని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు

ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట మండల బిజెపి నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ సమక్షంలో జమ్మికుంట మండల బిజెపి నాయకులు దొగ్గల భాస్కర్, పుల్లూరు సంపత్, కనకం కుమార్, రెంటాల కిరణ్, కొల్లూరు మురళి, నిశాంత్, రాజు, బోయిని వాసు, రాజేందర్‌బాబు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## మానవత్వం చాటిన మంచి మనుషులు



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : ప్రస్తుత రోజులలో ప్రతి ఒక్కరూ బిజీ జీవితాలను గడుపుతున్నారు. తాను, తన కుటుంబమే మాత్రమే అనుకుంటూ పక్కవారికి ఏమైనా పట్టించుకోని ఈ రోజులలో సాటి మనిషికి సాయం చేసే మంచి మనుషులు ఉన్నారని అనడానికి ఇదొక నిదర్శనం. శ్రీరాంపూర్ బస్టాండ్ పరిసర ప్రాంతంలో గత కొంత కాలంగా మతిభ్రమించి తల నిండా వెంట్రుకలు పెరిగి, మాసిన గడ్డం, దుర్గంధ దుస్తుతో తిరుగుతున్న యువకుడికి క్షవరం చేయించి, స్వయంగా నిండార స్నానం చేయించి, కొత్త బట్టలు తొడిగించిన తర్వాత భోజనం పెట్టించారు. పిచ్చివాడై తిరుగుతున్న తాను మనలాంటి మనిషేనని గుర్తించి మానవత్వంతో వారు చేసిన సేవలను స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు చంద్రయ్య, మెకానిక్ ల్యాకాత్, రమణారెడ్డి, మెకానిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన యోగి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి : తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు సిర్పూర్ కాగజ్ నగర్ ఫాతిమా కాన్వెంట్ పాఠశాల పిఈటి యోగి ఎంపికైనట్లు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కొమరం భీమ్ జిల్లా అధ్యక్షులు కేసరి ఆంజనేయులు గౌడ్ బుధవారం తెలిపారు. గతసెప్టెంబరులో హైదరాబాద్ కద్దల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు 4555 ఏళ్ల విభాగంలో వీరు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించనున్న పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి పథకాలు సాధించాలని, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన యోగిని జిల్లా అధ్యక్షులు కేసరి ఆంజనేయులు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్, ఫాతిమా కాన్వెంట్ ప్రిన్సిపల్ సిస్టర్ సపాల్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేసరి అలేఖ్య, కోశాధికారి జగన్నాథ అభినందించారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ప్రజాపక్షం/వీణవంక : వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

## భ్రూణ హత్యలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పక్కా కార్యాచరణ



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : మన సమాజంలో భ్రూణ హత్యలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ ఎన్.టి.పి.సి మిలీనియం హాల్లో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావ్, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు, ఆశ వర్కర్లకు వైద్య అధికారులకు పిసిపి ఎన్ డిటి యాక్ట్ పై నిర్వహించిన వర్క్ షాప్ లో మాట్లాడుతూ సమాజంలో లింగవివక్షతకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అమ్మ కడుపు నుండి వివక్షతకు గురవడం దారుణమని, సమాజంలో ప్రతి ఒక్కరూ లింగ వివక్షతకు వ్యతిరేకంగా కృషి చేయాలని ,భ్రూణ హత్యల కారణంగా స్త్రీల సంఖ్య వేగంగా పడిపోతుందని, భ్రూణ హత్యల నివారణకు ప్రభుత్వం 1994 లో పీసీ పీఎన్ డీటీ యాక్ట్ తీసుకొచ్చిందని , దీని ప్రకారం లింగ నిర్ధారణ చేసిన గర్భస్రావాలు చేయించిన ఇరువర్గాలు శిక్షార్హులు అవుతారని అదనపు కలెక్టర్ తెలిపారు.మొదటిసారి తప్పుకు 3 సంవత్సరాల జైలు, 10వేలు జరిమానా, రెండవ సారి తప్పు చేస్తే 5 సంవత్సరాల జైలు, 50 వేలు జరిమాన విధించే అవకాశముందన్నారు. అమ్మ కడుపులో ఉన్న ఆడపిల్లలను సంరక్షించాలని, పురుషులతో సమానంగా మహిళలను సైతం పెంచాలని అవగాహన కల్పించాలని ప్రతి ఆడపిల్లకు తప్పనిసరిగా విద్య అందించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పిల్లల సంరక్షణ, పునరావాసం కోసం 1098, వృద్ధులకు సేవలు అందించడం కోసం 1456, దివ్యాంగుల కోసం 11326, స్వీప్ ప్రోగ్రామ్ కోసం 1950, సైబర్ క్రైమ్ బాధితుల కోసం 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేస్తే ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఈ నెంబర్లను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారత కో ఆర్డినేటర్ దయ అరుణ, డిప్యూటీ డిఎం హెచ్.ఓ. కృపా బాయ్, డిసిపివో ఫర్విన్ , పెద్దపల్లి సిడిపివో కవిత, రామగుండం సిడిపివో జి. స్వరూప రాణి, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎం లు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం



ప్రజాపక్షం/యైటింక్లయిన్ కాలనీ : స్థానిక హనుమాన్ ఆలయంలో గురువారం శ్రీ హనుమాన్ పంచలోహ ఉత్సవ విగ్రహ చర ప్రతిష్ట, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. పట్టణ భక్త జనుల కోరిక మేరకు ఆలయ కమిటీ అధ్వర్యంలో ఈ నెల 26 నుండి 28 వరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. ఇక స్థానిక ఆలయ అర్చకులు సావిత్రి సుమంత్ కుమారచార్యులు వేదమంత్రాల మధ్య మొదటి రోజు స్వామి వారికి రక్షా బంధనం, అంకురారోపణం, జలాధివాసం, తీర్థప్రసాద గోష్టి, రెండవ రోజు ప్రాధకాల పూజ, ఆరాధన, మూర్తి కుంభ ఆరాధన, అగ్ని ప్రతిష్ట, మూల మంత్ర హోమము, తీర్థ ప్రసాద గోష్టి, కార్యక్రమాలు జరిగాయి. చివరి రోజు ఉదయం హోమము, మహా పూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ స్వామి నేత్ర ఉన్మలనం నవగ్రహ ప్రతిష్ట, 108 ఉష్ణోత్తర శత కలశాభిశేకం, కుంభ ప్రోక్షణ, శాంతి కళ్యాణం నిర్వహించారు. ఇక మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు భక్తజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## 10వ తరగతి జీవశాస్త్రం పరీక్షకు 7,716 మంది హాజరు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : 10వ తరగతి జీవశాస్త్రం పరీక్షకు 7,716 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో గురువారం నిర్వహించిన పదవ తరగతి జీవ శాస్త్రం పరీక్షలో 7,728 మంది విద్యార్థులకు గాను 7,716 మంది విద్యార్థులు హాజరు కాగా, 99.8 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 11 పరీక్షా కేంద్రాలు, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 1 పరీక్షా కేంద్రాన్ని, డిఈఓ.2 పరీక్షా కేంద్రాలను సందర్శించారని, మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

## రైతుల సమష్టి కృషితోనే సహకార సంఘం అభివృద్ధి



ప్రజాపక్షం/చిగురుమామిడి : రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయమని, రైతులకు రుణాలు అందించేందుకు సహకార సంఘాలు పనిచేస్తున్నాయని సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో గురువారం సింగిల్ విండో సర్వసభ్య సమావేశం చైర్మన్ జంగా వెంకట రమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో సంఘం కార్యనిర్వహణ అధికారి కాటం నరసయ్య వార్షిక నివేదికను రైతులకు, సభ్యులకు వివరించగా సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలో సభ్యులకు రూ.8.67 కోట్ల క్రాప్ లోన్, 3.64 కోట్ల దీర్ఘకాలిక , కర్షక మిత్ర లోన్ ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. వాయిదా మీరిన క్రాప్‌లోను వడ్డీని సభ్యులు చెల్లించి రుణమాఫీకి అర్హత పొందాలని కోరారు. సహకార సంఘాల ద్వారా వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తూ ఎరువులను విక్రయిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఎరువుల వ్యాపారం చిగురుమామిడి, ఇందుర్తి, రేకొండ సెంటర్ల ద్వారా అందించడం జరిగిందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు కరివెద మహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ముద్రోకల రాజయ్య, తాళ్లపెల్లి తిరుపతి, కూతురు రవీందర్ రెడ్డి, అందె స్వామి, పోతరవేని శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్, స్వామి, శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, లచ్చవ్వ, లక్ష్మి , సంఘం సెక్రటరీ కాటం నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయంలో మాజీ ఎంపి పూజలు



ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హనుమాండ్లపల్లి, మోత్కుల గూడెంలోని బాల ఆంజనేయ స్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎంపి, కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## టెట్ అర్హత పరీక్ష రుసుము తగ్గించండి



ప్రజాపక్షం/బోథ్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష రుసుము తగ్గించాలని గురువారం బోథ్ మండల తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ మల్లేష్ కు బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ విద్యార్థుల పేపర్ 1 రూ.1000,పేపర్ 2 కు 1000 రెండు వేలు పెంచడం బాధకరమని అన్నారు. ఆర్థిక భారం మోయలేని విద్యార్థులు చాలా మంది ఉన్నారని వారిని దృష్టిలో పెట్టుకొని టెట్ రుసుము తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లెపూల స్వామి, మల్లెపూల సుభాష్, బుచ్చన్న,కాడి రాజేందర్, రాథోడ్ రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయానికి ప్రణవ్ రూ.50వేల ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/వీణవంక : వీణవంక మండలంలోని వల్బాపూర్ శ్రీ సీతారామ దేవాలయ ఉత్సవాల్లో హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోత్సవాల మధ్య దేవత ఆశీర్వాదాలు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వల్బాపూర్ శ్రీ సీతారామ దేవస్థానానికి ఒడితల ప్రణవ్ బాబు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన కామెడీ శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో మహా అన్నదాన తీర్థ ప్రసాదాలను ప్రజలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వంచల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, కామెడీ శ్రీనివాస్ రెడ్డి, కల్వల సదాశివరెడ్డి, ఎలుక దేవాల్ రెడ్డి, కామెడీ శ్రీపతి రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

## సొసైటీ భవనానికి పన్ను మినహాయింపు ఇవ్వాలి

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ టీఎన్జీవోల సంఘం ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ భవనానికి సంబంధించిన పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సంఘం జిల్లా శాఖ ఆద్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చిన జీవో ప్రకారం ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీకి సంబంధించి పన్ను మినహాయింపు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. ఉత్తర్వులున్నప్పటికీ స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రతి యేటా డిమాండ్ నోటీసులు రావడం జరుగుతోందని, ఉత్తర్వులను అనుసరించి టీఎన్జీవోస్ వెల్ఫేర్ సొసైటీ భవనాలను డిమాండ్ నుంచి తొలగించాల్సిందిగా విన్నవించారు. సమస్యను శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. గతంలో పలుమార్లు ఈ విషయంపై మున్సిపల్ కార్యాలయంలో విన్నవించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంఘం లక్ష్మణ్‌రావు, అర్బన్ అధ్యక్షుడు హర్మీందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, అర్బన్ కార్యదర్శి సుమంత్ రావు, జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు, పవన్ కుమార్, వంశీ, అజయ్, నారాయణ, శ్రీమాన్ రెడ్డి, కరుణాకర్, షేక్ అంజాద్ తదితరులున్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన బాలాజీ



ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో గురువారం ఉష్కమల్ల మమతశ్రీనివాస్ దంపతుల కుమార్తె అనూష,మధు వివాహం, అడవి శ్రీరాంపూర్ లో సల్పాల రజిత,రవీందర్ కూతురు సుస్మిత,ప్రశాంత్ ల వివాహ మహోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దొద్ద బాలాజీ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల అధ్యక్షులు దొద్ద బాలాజీ, తోపాటు నాయకులు పాల్గొన్నారు.

## ఓ సి పి టు అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా దుండే రాజేందర్

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామానికి చెందిన దుండె రాజేందర్ ని ఓసిపి 2 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా దుండే రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు సింగరేణి ఆర్.జి త్రీ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. సింగరేణి ఆర్ జి త్రీ ఒసిపి టు లో జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహిస్తున్న రాజేందర్ కాంగ్రెస్ పార్టీలో ఏఐటియుసి లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నందుకు రాజేందర్ కు పదవి అప్పగించినట్లు కోట రవీందర్ రెడ్డి తెలిపారు. కాగా తన నియమకానికి సహకరించిన ఐటీ శాఖ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ, జనక్ ప్రసాద్ కి రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## కళాకారుని కుటుంబానికి చేయూత

ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం లోని బేగంపేట గ్రామానికి చెందిన దేవుని రాజమ్మ మృతిచెందగా వారి కుమారుడైన కళాకారుడు రవివర్మకు కమాన్పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయంతో 3000 రూపాయలు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే లైన్స్ క్లబ్ లక్ష్యమని వారన్నారు.

## కమనీయం శివపార్వతుల కల్యాణం



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో గల సాంబశివ దేవాలయంలో శివపార్వతుల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా కన్నుల పండువగ జరిగాయి. కళ్యాణ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి మాత దేవాలయంలో స్వామి వారి ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పల్ల మురళి, పూజారి పారువెల్ల రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

# వేరుశనగ క్షేత్ర దినోత్సవ కార్యక్రమం



ప్రజాపక్షం/రామగిరి : కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రంలో భాగంగా వేరుశనగలో క్షేత్ర దినోత్సవం కార్యక్రమాన్ని కమాన్పూర్ మండలంలో పెంచికలపేట గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సంవత్సరం గాను సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 37 1/2 ఎకరాలకు గానూ వేరుశనగ విత్తనాన్ని ఈ యాసంగి సీజన్ నందు పలు గ్రామాలలో పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ పిల్లి మృత్తిక శాస్త్రవేత్త మాట్లాడుతూ వేరుశనగ పంట యాజమాన్యం మరియు సస్యరక్షణ గురించి రైతులకు వివరించి వేరుశనగ పంట వల్ల నేలకు జరిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అజ్మీర సురేష్ మాట్లాడుతూ పంట మార్పిడి యొక్క ప్రాముఖ్యతను మరియు దాని యొక్క అవసరాన్ని రైతులకు తెలియ చేశారు. విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ అండ్ హెడ్ డాక్టర్ ఏ శ్రీనివాస్ గారు కె వి కే యొక్క ప్రాముఖ్యత మరియు క్షేత్ర ప్రదర్శనలను రైతులకు ఎలా ఉపయోగపడతాయో వివరించమే కాకుండా నూనె గింజల యొక్క ప్రాముఖ్యత మరియు నూనె ఉత్పత్తిలో జరుగుతున్న కల్తీ ల గురించి రైతులకు చెబుతూ కెవికె అందిస్తున్న ఈ సేవలను వినియోగించుకొని మంచి లాభాలు సాధించాలని కోరారు.అనంతరం వివిధ వేరుశనగ క్షేత్రాలను పరిశీలించి రైతుల యొక్క అనుభవాలను తెలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషలాఫీసర్ మహేందర్ గారు, కెవికె హెడ్ డాక్టర్ శ్రీనివాస్ గారు, మృతిక శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పిల్లిగారు, వ్యవసాయ విస్తరణ అధికారి అజ్మీర సురేష్ మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఇ శ్రామ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ ఈ శ్రామ్ పోర్టల్ లో పేరు నమోదు చేసుకొని ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం పొందిన అసంఘటిత కార్మికులకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వత శాఖ ఎక్స్‌షియా అందిస్తుందని జిల్లా ఉపాధి కార్మిక శాఖ కమిషనర్ శ్యాముల్ జాన్ తెలిపారు. ప్రధానమంత్రి బీమా యోజన సంరక్షణ కింద26082021 నుండి31032022 మధ్య ఈ శ్రామ్పోర్టల్ లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు మరణించిన లేక శాశ్వత అంగవైకల్యం పొందిన అసంఘటిత కార్మికుల నామినీలకు , కార్మికులకు ఎక్స్‌సియా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నదని, మరణించిన కార్మికుల నామినేలకు రెండు లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికులకు లక్ష రూపాయలు అందిస్తున్నదని, కావున కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని అర్హులైన అసంఘటిత కార్మికులు3003 2024 సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు తో పాటు మరణ ధ్రువ పత్రం, ఆధార్ కార్డు, ఈ శ్రామ్ కార్డు, ఎఫ్ఐఆర్ పంచనామా రిపోర్టు, పోస్టుమార్టం రిపోర్టు, నామిని యొక్క బ్యాంకు పాస్ బుక్ తగు వివరాలు జతచేసి ఉప కార్మిక కమిషనర్ కార్యాలయం పొన్నం కాంప్లెక్స్ కరీంనగర్ నందు అందజేయాలని తెలిపారు.

## అంగరంగ వైభవంగా ..రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం



ప్రజాపక్షం/రామగిరి : కమాన్ పూర్ మండల కేంద్రంలోని పిల్లిపల్లీ లో గల రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతి పోజొత్సవంతో అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమైంది. దాదాపు వారం రోజుల పాటు జరగనున్న రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవం వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరగాలని ఆకాంక్షిస్తూ ప్రథమంగా గణపతి పూజొత్సవంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం కల్యాణోత్సవం వేడుకల నేపథ్యంలో సంప్రదాయ ప్రకారంగా డప్పు చప్పుళ్ళ మధ్య రేణుక ఎల్లమ్మ ఆలయం నుండి పాలపోరుక వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు దేవాలయాన్ని శుద్ధి చేసి రేణుక ఎల్లమ్మ మాతకు కొబ్బరికాయలు కొట్టి గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ ఉత్సవ వేడుకలు ప్రారంభ రోజే స్థానిక కమాన్ పూర్ గ్రామంలోని గౌడ కులబాంధవులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తరలివచ్చి రేణుక ఎల్లమ్మ ను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత సంపత్ రావుదే



ప్రజాపక్షం /రామగిరి : ఎందరో విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత పల్లెపాటి సంపత్ రావుది అని పెద్ద పల్లి జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, జిల్లా విద్యాధికారిని డి మాధవి అన్నారు. గురువారం రామగిరి మండలంలోని జేఎన్టీయూ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆరు మండలాల ఇన్చార్జి ఎంఈఓ పల్లెపాటి సంపత్ రావు పదవీ విరమణ వేడుకలను తస్మా జిల్లా అధ్యక్షుడు అబ్బు కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులకు విద్యాబోధనలు చేసి వారిని మేధావులుగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి ట్రస్మా అడ్వైజర్ వై శేఖర్ రావు నాయకులు కరస్పాండెంట్లు బర్ల శ్రీనివాస్ లక్ష్మ ణ్ కుమార్ చదువు వెంకట్ రెడ్డి పాపిరెడ్డి రవీందర్రావు అశోక్ పాశం ఓదెలు యాదవ్ మబ్బు శ్రీనివాస్ యూనివర్సల్ స్కూల్ కరస్పాండెంట్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థలలో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల కొరకు అదే విధంగాకరీంనగర్, గౌలిదొడ్డి సిఓఇ లలో 9 వ తరగతిలో రెగ్యులర్ ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21 న జరుగనుంది. దీనికి దరఖాస్తు చేసుకోవటానికి ఆఖరు తేది మార్చి 30 వరకు పొడగించబడింది. కరీంనగర్ సిఓఇలో 80 సీట్లు బాలురకు, 80 సీట్లు బాలికలకు, గౌలిదొడ్డి సిఓఇ లో 80 సీట్లు బాలికలకు 9 వ తరగతిలో కలవు.

కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ సమన్వయాధికారి జె జె తెరిసా తెలిపారు. వివరాలకు www.tswreis.ac.in సంప్రదించగలరు.

## నిరుపేద పెళ్లి కూతురు వివాహ ఖర్చుల కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ చేయూత




ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం లొంక కేసారం గ్రామానికి చెందిన నంసాని సుస్మిత పెళ్లి ఖర్చుల కొరకు గురువారం లైన్స్ క్లబ్ పెద్దపెల్లి ఆర్థికంగా చేయూత అందించారు . పెళ్లి కూతురు సుస్మిత తల్లిదండ్రులు గతంలో చనిపోగా అలాగే సుస్మిత అక్క భర్త కూడా చనిపోవడం జరిగింది. పెద్దదిక్కు లేని సుస్మిత వివాహం కొరకు ఆర్థిక సహాయం అందజేయాల్సిందిగా లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి దృష్టికి తీసుకురాగా లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో సభ్యుల సహకారం తో సేకరించిన 11116/ రూపాయలను పెళ్లికూతురు సుస్మిత కి అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి అధ్యక్షులు లయన్ సాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు లయన్ మీసాల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అఫ్ సెంటనరీ కాలనీ అధ్యక్షులు లయన్ ముల్మూరి శ్రీనివాస్, క్లబ్ డైరెక్టర్ మాజి జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, చెలుపురి ఓదెలు, మేకల మారుతి ఒజ్జె ఓదెలు పాల్గొన్నారు.

## కార్యకర్తలతో తేనీటి పార్టీలో పాల్గొన్న మాజీ మంత్రి



ప్రజాపక్షం/రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని టీ స్టాల్ వద్ద మాజీ మంత్రి బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సరదాగా కార్యకర్తలతో కలిసి తేనీటి పార్టీలో పాల్గొన్నారు. ఆయన గురువారం రుద్రంగి మండల ఎంపీపీ గంగం స్వరూప మహేష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి వేములవాడ కు వెళ్లిన ప్రశాంత్ రెడ్డి తిరుగు ప్రయాణంలో రుద్రంగి మండల కేంద్రంలోని ఓ రిపోర్టర్ కు సంబంధించిన టీ స్టాల్ వద్ద మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ సరదాగా ముచ్చటించారు. ఆయన వెంట మాజీ మార్క్ఫడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాధనవేని రాజారాం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేగవత్ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్ చిన్నారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు దయ్యాల కమలాకర్, మంచే రాజేశం, చెప్యాల గణేష్, నరు నాయక్, భూమా నాయక్, దయ్యాలు నారాయణ, కాదాసు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎంపి టికెట్ మార్చాలి




ప్రజాపక్షం/ సుల్తానాబాద్ : పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ మార్పు చేయాలని, మాదిగలకు తెలంగాణ రాష్ట్రంలో రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని దేశ రాజధాని ఢిల్లీలోని ఏఐసీసీ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ముందు నిరసన తెలియజేయడం జరిగింది. పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్ ఒకటే కుటుంబానికి మూడు టిక్కెట్లు ఇవ్వడం, పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలను అగౌరవరచడం సరికాదని నాయకులు అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్ మూడు నెలల ముందు పార్టీ లో చేరిన వివేక్ కుటుంబానికి ఇవ్వడం పై పార్టీ కార్యకర్తలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. పెద్దపల్లి పార్లమెంటు టిక్కెట్ యువజన కాంగ్రెస్ మాజీ జాతీయ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ కే ఇవ్వాలని, కంటోన్మెంట్ అసెంబ్లీ టిక్కెట్ గజ్జెల కాంతం కైనా, పిడమర్తి రవి కైనా ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ జాతీయ కార్యాలయం ముందు డప్పులు కొట్టి, నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, మాదిగ, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది డబ్బు లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కోర్టులో జరిగిన ఎన్నికలలో రాచకొండ శ్రీరాములు, డబ్బు లక్ష్మారెడ్డిలు పోటీపడగా 2 ఓట్ల తేడాతో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా డబ్బు లక్ష్మారెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డిని ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## చెరువులను పూడిస్తే చర్యలు తప్పవు

ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని వేంపల్లి వెంకట్రావుపేట గ్రామాల్లోని పెద్ద చెరువును ఇరిగేషన్ డిఈ దేవానంద్ గురువారం పరిశీలించారు. శిఖం భూములు కలిగిన రైతులు చెరువుల్లో నీరు లేనప్పుడు మాత్రమే పంటలు సాగు చేసుకోవాలని, కాదని చెరువులను పూడిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట ఏఈ రాకేష్, వర్క్ ఇన్స్పెక్టర్, కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

## జయతు జయతు సినిమా షూటింగ్ ప్రారంభించిన ప్రణవ్



ప్రజాపక్షం/హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జయతు జయతు సినిమా ముహూర్తపు షూటింగ్‌కి హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ క్లాప్ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హీరో రాఖీ, హీరోయిన్ శ్రీ రమ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.81వేల నగదు సీజ్

ప్రజాపక్షం/కాసిపేట : కాసిపేట మండలం సోమగూడెం చెక్ పోస్ట్ వద్ద రూ.81వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ల వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కరీంనగర్‌కు చెందిన రియాజ్ అనే వ్యక్తి వద్ద రూ.81వేల నగదు పట్టుబడిందని, పట్టుబడిన నగదుకు రియాజ్ ఎలాంటి సరైన పత్రాలు చూపనందున నగదును స్వాధీనం చేసుకుని ఎస్ఎస్‌టి టీం ఇన్చార్జికి అప్పగించినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు రూ. 50వేల కంటే ఎక్కువ నగదు, వస్తువులు కలిగి ఉండరాదని, ఒక్కవేళ అధిక మొత్తంలో నగదు, ఇతర వస్తువులు కలిగి ఉన్నట్లయితే వాటికి పత్రాలను చూపించాలని తెలిపారు.

## తనిఖీల్లో పట్టుబడ్డ 1.31లక్షలు

ప్రజాపక్షం/ జైనూర్ : లోక సభ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా గురువారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని జంగావ్ సమీపంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 1 లక్ష 31 వేల రూపాయలు పట్టుబడినట్లు జైనూర్ ఎస్ఐ సందీప్ కుమార్, ఏఎస్ఐ రమేష్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా తనిఖీలో పట్టుబడిన డబ్బులకు సరైన పత్రాలు చూపని కారణంగా నగదును సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ కి అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోస్కుల శ్రీనివాస్



ప్రజాపక్షం/హుజురాబాద్ : హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా గోస్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బండి రమేష్, ప్రధాన కార్యదర్శిగా మట్టెల తిరుపతి, లైబ్రరీ సెక్రటరీగా అప్పని రాజు, కోశాధికారిగా ఎం. దివ్య, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పులుగు లింగారెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కే. భగవాన్ రెడ్డి, సికె జేమ్స్, ఎన్. సత్యనారాయణలు తెలిపారు. మొత్తం 115 మంది ఓటర్లకు గాను 113 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన గోస్కుల శ్రీనివాస్‌కు 71ఓట్లు, యతిపతి అరుణ్ కుమార్‌కు 41ఓట్లు వచ్చాయి. కాగా ఒక ఓటు చెల్లకుండా పోయింది. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన బండి రమేష్‌కు 59ఓట్లు, బోనగిరి కుమారస్వామికి 52ఓట్లు రాగా, 2ఓట్లు చెల్లలేదు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన మట్టెల తిరుపతి కి 64 ఓట్లు, ఎర్రోళ్ల రమేష్‌కు 45 ఓట్లు రాగా 4ఓట్లు చెల్లకుండా పోయాయి. కోశాధికారి పదవికి పోటీ చేసిన ఎం. దివ్యకు 66 ఓట్లు రాగా, సిహెచ్ భానుకిరణ్ కు 44 ఓట్లు రాగా 3ఓట్లు చెల్లకుండా పోయాయి. లైబ్రేరియన్ పదవికి పోటీచేసిన అప్పని రాజుకు 56 ఓట్లు, బత్తుల తిరుపతికి 54 ఓట్లు రాగా, 3 ఓట్లు చెల్లకుండా పోయాయి. సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పోటీ చేసిన పులుగు లింగారెడ్డికి 65 ఓట్లు, అందె వెంకటేశ్వర్ రావుకు 48 ఓట్లు వచ్చాయి. కాగా సహాయ కార్యదర్శి గా పి. జ్యోత్స్న దేవి,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కే. సరిత, మహిళా సభ్యురాలుగా మూశం మౌనిక గతంలోనే ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

## ఆదివాసుల జోలికిస్తే సహించేది లేదు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ ఆదివాసులపై అధిపత్యం సాధించాలని వలసవాదులు చేసే కుట్రలు తిప్పికొడతామని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మంద మల్లేష్,వెంకగారి నర్సయ్య(సత్య) అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ,ఎమ్మెల్యే టికెట్లు ఆదివాసులకే ఇస్తారా అంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్న రాజేష్ బాబు నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలవాలని సవాల్ విసురుతున్నాం.ఆయా రాష్ట్రాల నుంచి వలస వచ్చి బ్లాక్ మెయిల్ చేస్తే భయపడేది లేదని స్పష్టంచేశారు.ఏ పార్టీ అయినా ఆదివాసి అభ్యర్థిని గెలిపించుకుంటామని, ఎవరు అడ్డపడ్డ ఆదివాసుల గెలుస్తారని ధీమ వ్యక్తం చేస్తున్న మన్నారు.బీజెపి,కాంగ్రెస్,టిఆర్ఎస్ పార్టీలు ఆదివాసులకే టికెట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్న మన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలలో ఆదివాసి అభ్యర్థులను ఎన్నుకుంటామని, మిగతా కులాలు కూడా తమకే మద్దతిస్తున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వలసవాదులు ఆధిపత్యం ఎక్కువైపోయిందని ఏ ప్రభుత్వ కార్యాలయంలో వారి ఆధిపత్యమే ఉండడం, ఇతర కులాలని కూడా అనుగదొక్కే ప్రయత్నం చేస్తారని, వారికి రాజకీయంగా అవకాశం ఇస్తే ఇక ఇతర కులాలకు, తెగలకు అవకాశం ఉండదు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, లక్ష్మణ్, సూంచ శ్రీనివాస్,రాజేశ్వర్, సురపు సాయన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పుప్పాల లింబాద్రి



ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పుప్పాల లింబాద్రి , ప్రధాన కార్యదర్శిగా తునికి వేణుగోపాల్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు మగ్గిడి వెంకటనర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి పసునూరి శ్రీనివాస్, నల్ల రాజేందర్‌రెడ్డి లు తెలిపారు. గురువారం నిర్వహించిన ఎన్నికలు కౌంటింగ్ అనంతరం వారు మాట్లాడుతూ మొత్తం 142 ఓట్లు పోలవ్వగా ప్రస్తుత అధ్యక్షులు లింబాద్రి కి 83 ఓట్లు రాగా, ఆకుల సురక్షకి 57 ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన తునికి వేణు గోపాల్‌కి 99 ఓట్లు కటకం వేణు గోపాల్‌కి 40 ఓట్లు వచ్చాయన్నారు. కాగా ఉపాధ్యక్షులుగా ఎల్ముల రాంబాబు, స యుక్త కార్యదర్శిగా రాంపల్లి జగన్, కోశాధికారిగా రాజేష్ శెట్టి, క్రీడలు , సాంస్కృతిక కార్యదర్శులుగా మగ్గిడి హరిభూషన్, మగ్గిడి నర్సయ్యలు, లైబ్రరీ కార్యదర్శిగా కోట రాజారెడ్డి, లేడి రిప్రెజెంటివ్‌గా కాజీపేట స్రవంతి, సీనియర్ ఈసీ మెంబర్లుగా ఒజ్జల శ్రీనివాస్, అలాల సత్యనారాయణ, సురభి అశోక్‌లు జూనియర్ ఈసీ మెంబర్లుగా మన్నె గంగాధర్, వాల్గోట్ మహేష్, కొమిరెడ్డి శేషగిరిలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఎన్నికైన కార్యవర్గం చేత ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన కార్యవర్గం ఏప్రిల్ 1 నుండి సంవత్సరం పాటు విధులు నిర్వహిస్తారని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు తెలిపారు.

## ఆస్తి పన్నుల వసూళ్లలో 2వ స్థానంలో హుజురాబాద్



ప్రజాపక్షం / హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పురపాలక సంఘం ఆస్తి పన్నుల వసూళ్లలో తెలంగాణ రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. హుజురాబాద్ పురపాలక సంఘం మొత్తం ఆస్తి పన్నుల డిమాండ్ రూ.లు 2,49,00,000రూ.లు కాగా, పురపాలక సంఘం కమిషనర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, బిల్ కలెక్టర్లతో కలిసి ప్రతి రోజు మోఖాపై పన్నుల వసూళ్లు చేస్తూ, తేది 27032024 నాటికి రూ.లు 2,29,00,000 రూ.లు వసూలు చేసి నాటికి 92.12శాతంతో రాష్ట్రవ్యాప్తంగా రెండవ ర్యాంకు సాధించిన పురపాలక సంఘంగా నిలిచిందని మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య తెలిపారు. అదే విధంగా 31032024 వరకు పన్నుల వసూళ్లకు చివరి తేదీ అయినందున, ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, ఇతర షాపింగ్ గదుల కిరాయిలు, బకాయి ఉన్న యజమానులు వెంటనే మీమీ పన్నులను నిర్ణీత గడువులోగా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట మేనేజర్ రాంమోహన్ రాయ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి. సంపత్ రావు, ఇంచార్జీ సానిటరీ ఇన్స్పెక్టర్ యం. కిషన్ రావు, కార్యాలయ బిల్ కలెక్టర్లు, వార్డ్ అధికారులు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటివద్దే ఓటు హక్కు

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : ఇంటివద్దే ఓటు హక్కు వృద్ధులకు వెసులుబాటుని జగిత్యాల లోక్ సభ ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులకు దివ్యాంగులకు ఇంటినుంచే ఓటు వేసే వెసులుబాటు కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందని తెలంగాణ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర క్యాదర్శి జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్, న్యాయవాది హరిఅశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 85 పైబడిన వయస్సు గలవారు , 40 శాతం అంగవైకల్యం ఉన్నావారు ఇంటివద్దే నుంచే ఓటు హక్కు వేయవచ్చని నిబంధనలకు అనుగుణంగా ఓ కపార్ట్‌మెంట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ అందుబాటులోకి వచ్చిందని అర్హులైన వారు ఫారం 12డీ నింపి రిటర్నింగ్ అధికారి సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని వృద్ధులు వికలాంగులు వినియోగించుకోవాలని హరి అశోక్‌కుమార్ కోరారు.

## అక్రమ మద్యం, డబ్బు, గంజాయి జిల్లాలోనికి ప్రవేశించకుండా ముమ్మర తనిఖీలు చేపట్టాలి

ప్రజాపక్షం/కౌటాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కౌటాల మండలంలోని తుమ్మిలేటి వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర బార్డర్ చెక్ పోస్టులను జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అక్రమంగా మద్యం, డబ్బు, గంజాయి, మాదకద్రవ్యాలు, ఎన్నికలలో ప్రభావితం చేసే బహుమతులను, రవాణా కాకుండా ముమ్మర తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. 24 గంటలు చెక్ పోస్టుల వద్ద తనిఖీ నిర్వహించాలని, తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరి అని సూచించారు. రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్ట్, సిబ్బంది సమన్వయంతో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. అనంతరం కౌటాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది విధులను పరిశీలించారు. చెక్ పోస్ట్‌ల నందు పూర్తి అప్రమత్తతతో విధులను నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డిఎస్‌పి కరుణాకర్, కౌటాల సిఐ సాదిక్ పాషా, ఎస్ఐ మధుకర్ పాల్గొన్నారు.

## సల్పల వాగు అడవిలో మంటలు



ప్రజాపక్షం/కాసిపేట : కాసిపేట మండలం దేవాపూర్ సల్పల వాగు అడవిలో గురువారం మంటలు చెలరేగాయి. ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని దేవాపూర్ ప్రధాన రోడ్డు సమీపంలో మంటలు కనిపించడంతో వాహనదారులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీలో పనిచేస్తున్న కూలీలు, లేక మరెవరో నిప్పు పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలు అడవుల సంరక్షణకు సహకరించాలని, వేసవి కాలంలో అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టరాదని, అడవులకు నిప్పు అంటించడం వలన మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అడవులు అంతరిస్తాయని అన్నారు. అటవీ జంతువులకు హాని కలిగించే విధంగా ఎవరు వ్యవహరించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దూరదర్శన్ స్ట్రింగర్ల ఎంపానెల్ మెంట్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రీజనల్ న్యూస్ యూనిట్, దూరదర్శన్ కేంద్ర స్ట్రింగర్ల ఎంపానెల్ మెంట్ కొరకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆర్ఎన్‌యు హెడ్ సంయుక్త సంచాలకులు (వార్తలు) రాహుల్ గోలేకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో దరఖాస్తులు సమర్పించే ఆఖరి తేదీని ఏప్రిల్ 30 వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు వివరాల కొరకు ఆన్ లైన్ లో www.prasarbharati.gov.in/pbvacancies వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** నిత్యం వార్డు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు పేర్కొన్నారు గురువారం మున్సిపల్ పరిధిలోని 07వార్డు యాదవ్ నగర్ లో పరిసరాల పరిశుభ్రత లు పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ వార్డు ప్రజలు కాలనీలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని కాలనీలు శుభ్రంగా ఉంటే ఎలాంటి రుగ్మతలు దరి చేరవని ప్రతి ఒక్కరూ విధిగా తడి పొడి చెత్తను వేరుచేసి మునిసిపల్ వాహనం తో వచ్చిన సిబ్బందికి అందించాలని అన్నారు.కాలువలలో చెత్త చెదారం వేయవద్దని ప్లాస్టిక్ గాజు సీసాలు ఇతరత్రా నిలువ చేసి సిబ్బందికి అందించాలని కవర్లు ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని, వాటి ద్వారా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు ,కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకుంటే తద్వారా మున్సిపల్ పూర్తిగా స్వచ్ఛ మున్సిపల్ గా మారుతుందని రోడ్ల పై ఇంటి చుట్టుపక్కల ఎలాంటి పిచ్చి మొక్కలు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకుంటే దోమలు ఈగలు దరిచేరకుండా పరిశుభ్రంగా గృహాలు ఉంటాయని అన్నారు విధిగా ప్రతి ఒక్కరు సహకరించి సుల్తానాబాద్ మున్సిపల్ ను స్వచ్ఛ మున్సిపల్ గా మార్చేందుకు సహకరించాలని కోరారు, పారిశుద్ధ్య సిబ్బందిచే పేరుకు పోయిన మురికి కాలువలను శుభ్రం చేయించారు, అనంతరం ప్రతి ఇల్లు ,ఇల్లు తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో వాడు కౌన్సిలర్ కూకట్ల గోపి, సానిటరీ జవాన్లు రాజకుమార్ ,ఆనంద్, ల తోపాటు కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పడాల శ్రీరాములు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో 43 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగంచుకున్నారు. అధ్యక్ష స్థానానికి ఆలూరి శ్రీనివాసరావు, పడాల శ్రీరాములు పోటీపడగా పడాల శ్రీరాములు కు 29 ఓట్లతో అధ్యక్షుడు గా విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవికి బోయిని భూమయ్య, జోగుల రమేష్, వేపూరి తిరుపతి లు పోటీ పడగా జోగుల రమేష్ 23 ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పెగడ శ్యాం సుందర్, సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవికిరణ్, లైబ్రరీ కార్యదర్శిగా అవుల శివ కృష్ణ, మహిళా ప్రతినిధి గా పి. సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీ రాజం, బాలకిషన్ ప్రసాద్, పబ్బతి లక్ష్మీ కాంత్ రెడ్డి, అకారపు సరొత్తంరెడ్డి, వోడ్నాల రవీందర్, అవునూరి సత్యనారాయణ ,జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మల్యాల కరుణాకర్, తాళ్ళపల్లి లక్ష్మణ్, అరెల్లి రాములు, వంగల యుగంధర్ రెడ్డి, బొబ్బిలి శ్యాం, గుడ్ల వెంకటేష్ లను ఎన్నుకున్నారు. పడాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.

# వరి కొనుగోలు పై శిక్షణ కార్యక్రమం




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** వరి కొనుగోలు పై శిక్షణా కార్యక్రమం కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో నిర్వహించారు.అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో డి సి ఎం ఎస్,పి ఏ సీ ఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వరి పంట కోతకు వచ్చిన తరుణంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన వరిని సరైన తేమ శాతం వచ్చిన తర్వాతనే లోడింగ్ చేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవితాపం పెరిగిపోతున్నందున మంచి నీటి సదుపాయాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలన్నారు.ముఖ్యంగా హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు.లారీ అసోసియేషన్ వారు కూడా వరి కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలన్నారు.లారీ లోడ్ అయిన తర్వాత అన్లోడింగ అయ్యేంత వరకు దానికి సంబంధించిన ఆన్లైన్ లో వివరాల ఎంట్రీ.జియో టాగింగ్ తదితర అంశాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.కొనుగోలు కు సంబంధించి ఎక్విప్మెంట్ కొరత లేకుండా చూడాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమం లో సివిల్ సప్లయ్ డి.ఎం. శ్రీకల, డి.సి.ఎస్.వో నందిని,డి.సి.ఓ నర్సయ్య,ఏ డీ మార్కెటింగ్ అశ్ఫాక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, పేదలకు పంచిపెడతాం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని,పేదలకు పంచిపెడతమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.గురువారం రోజు తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో నిర్మల్ లో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేసిన అవినీతి అక్రమాలను అధికారం కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందని,సోఫీనగర్ లో ప్రభుత్వ భూమిలో కట్టిన డీమార్ట్ విషయంలో అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వెంటనే చర్యలు తీసుకోకుంటే ప్రజలే ధ్వంసం చేస్తారని అన్నారు.డీమార్ట్ ల్యాండ్ విషయంలో స్వయంగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ఆదేశాలు ఇచ్చిన జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు.అధికారులే డీమార్ట్ కట్టిన భూమి ప్రభుత్వానిదేనని, సర్టిపై చేసిన అధికారులే మళ్లీ ఎల్లా అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. దొంగ పత్రాలు సృష్టించి తాత్కాలికంగా డీమార్ట్ ను ఓపెన చేయించినా త్వరలోనే అక్కడి ప్రభుత్వ భూమిపై చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడితెస్తాం,న్యాయ పోరాటం కూడా చేస్తాం అన్నారు.సోఫీనగర్ తో పాటు గాజులపేట,వెంకటాపూర్,అయ్యప్ప టెంపుల్ ఇలా చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ, దేవాదాయ భూముల విషయంలోనూ అధికారుల తీరు నిర్లక్ష్యంగానే ఉందని అధికారులు తెరుకొని చర్యలు చేపట్టాలని అన్నారు.జిల్లా అధికారులు నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోకపోతే,బీజేపీ నేతలంతా కషాయ జెండాలు ధరించి గాజుల పేటలోని శ్రీ కృష్ణా దేవాలయం భూములు కాపాడుకునేందుకు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

### జాయింట్ కలెక్టర్ బిజెపి నాయకులు సమావేశం

జాయింట్ కలెక్టర్ తో జిల్లా బీజేపీ నాయకులు,మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రామ్నాథ్, సమావేశం నిర్వహించారు.డీమార్ట్ భూమి ముమ్మాటికి ప్రభుత్వ భూమేనని,వాస్తవాలు చెప్పకుండా తప్పుదోవపట్టిస్తే,న్యాయ పోరాటం చేసి,భూమి స్వాధీనం చేసుకుని,పేదలకు పంచిపెట్టేవరకు బీజేపీ పోరాటం చేస్తుందని చెప్పారు.

# కేరమెరిలో ఫ్లాగ్ మార్చ్

**ప్రజాపక్షం/ కెరమేరి :** మండలకేంద్రంలో జిల్లా ఎస్పి సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలతో కలిసి అసిఫాబాద్ డిఎస్పి సదయ్య, వాంకిడి సిఐ శ్రీనివాస్, కెరమేరి ఎస్ఐ గుంపుల విజయ్ల ఆధ్వర్యంలో ప్రధాన రహదారులతో పాటు మండలంలోని పలు వీధుల గుండా కవాతు నిర్వహించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ డిఎస్పి సదయ్య మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నిబంధనల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు కనబడితే సమచారం అందించాలని, యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణ, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడం, నేరాలు నిర్మూలించేందుకే ఈ కవాతు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ బలగాలు, పోలీస్ అధికారులు, పోలీస్లు పాల్గొన్నారు.

# ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మంత్ర



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు ముగిసాయి.గురువారం జరిగిన కార్యక్రమంలో,బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా, మంత్రరాజ్యం సురేష్, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల సత్యనారాయణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి గోనే శ్రీనివాస్,ఆసిఫ్అలీ,షబ్బీర్ బాషలు తెలిపారు.కాగా ఎన్నికల నేపథ్యంలో సురేష్,బక్క శెట్టి కిషోర్ లకు సమాన ఓట్లు రాగా,డ్రా పద్ధతిన సురేష్ గెలుపొందినట్టు తెలిపారు. ఉపాధ్యక్షులుగా,ఇమాముద్దీన్ ఫారూఖ్, జాయింట్ సెక్రటరీగా పోలంపల్లి రాజు,కోశాధికారిగా షేక్ అంజాద్ అహ్మద్,ఎంపికైనట్లు తెలిపారు.

# రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/కడెం :** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఎన్నిక చేసిన రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించిన సుంకేట అన్వేష్ రెడ్డి ని నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్ వర్మలు, అన్వేష్ రెడ్డి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు.కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు గా రైతుల కోసం అనేక కార్యక్రమంలు చేపట్టిన ఆయనకు పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం..



**ప్రజాపక్షం/ముధోల్ :** క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని ముధోల్ సాయాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయానంద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముధోల్లోని సామజిక ఆసుపత్రిలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ అని ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందన్నారు. విడువని దగ్గు,తుమ్మడం, ఉమ్మివేయడం, ద్వారా గాలిలో కలుస్తుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉంటే డాక్టర్లను సంప్రదించి చికిత్స తీసుకుంటే సత్వరమే కొలుకుంటామని పేర్కొన్నారు. రోగులకు ఉచితంగా మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి సువర్ధన్, యంఓ డాక్టర్ రాహుల్, టిబి సూపర్వైజర్ లాలయ్య, హెడ్ నర్స్ పద్మ, స్టాఫ్ నర్స్ పార్వతి, ఎఎన్ఎం విజయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెంగిచెర్లలో గిరిజన మహిళపై దాడి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** పరామర్శించడానికి వెళ్లిన బీజేపీ ఎంపీ బండి సంజయ్, ఇతర నేతల పై అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదని అలాగే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ను అక్కడకు వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేయడం దారుణమని బిజేఎల్పి నేత ఎలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూత్వరలోనే బీజేపీ శాసనసహభాపక్షం తరుపున బాధితులను పరామర్శిస్తామని,ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి,నిర్లక్ష్యం చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని,ఇది మంచిది కాదన్నారు.బాధితులపై రివర్స్ కేసులు పెట్టడం దారుణమని త్వరలోనే ఆందోళన కార్యక్రమం అన్నారు.

# రేణుక ఎల్లమ్మ ప్రతిష్టాపన ఉత్సవాలకు హాజరైన డిసిసి అధ్యక్షులు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే శ్రీహరి రావు నిర్మల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలకు హాజరుయ్యారు.నిర్మల్ మండల అక్కాపూర్ గ్రామ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో గత ఐదు రోజులగా ప్రతిష్టాపన ఉత్సవాలు నిరవ్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీహరి రావు మాట్లాడుతూ భక్తుల ఇలవేల్పు రేణుక ఎల్లమ్మ అనుగ్రహం అందరికీ అందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దైవజ్ఞ గురుమంచి చంద్రశేఖర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీహరి రావు ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు,గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా సంకష్టహర చతుర్థి వేడుకలు



**ప్రజాపక్షం/మంథని :** మంథని పట్టణంలోని శ్రీ మహాగణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలను భక్తులు గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయ పూజారి పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో శ్రీమహాగణపతి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.